15న పాడేరులో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి- పాడేరు : ఈ నెల 15వ తేదీన పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆద్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ చాంబర్ లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన మెగా జాబ్ మేళా పోస్టర్ ను కలెక్టర్ విడుదల చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అత్యంత ప్రతిష్ట గల సుమారు 28 సంస్థలు ఈ మెగా జాబ్ మేళాలో పాల్గొని వారికి అవసరమైన నిరుద్యోగ అభ్యర్థులను ఎంపిక చేసి వెంటనే వారికి నియామక ఉత్తర్వులు అందజేస్తారని ఈ అవకాశాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18ఏళ్ళు నిండిన పదవ తరగతి ఆ పైన ఉన్నత చదువులు, డిగ్రీ పూర్తి చేసిన వారు, ఫార్మసీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ పూర్తి చేసిన నిరుద్యోగ యువత ఈ మెగా జాబ్ మేళాకు హాజరై ఉపాధి పొందాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాదికారి పి. రోహిణి, సహాయకులు నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల గోడు వింటూ...

ఊరూరా సిపిఎం ప్రజా చైతన్య యాత్రలు

దుంబ్రిగుడలో...

ప్రజాశకి-జి.మాడుగుల: ఆదివాసీ గ్రామాలైన కుంబిడిసింగి పంచాయతీ రాళ్ళగడ్డ వాగు వద్ద బ్రిడ్జి నీ వెంటనే నిర్మించాలని సి.పి.ఎం జిల్లా కార్యదర్శి పి అప్పలనరస ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సి.పి.ఎం అధ్వర్యం లో స్థానిక సమస్యలు పరిష్కారం కోసం ప్రజా చైతన్య యాత్ర ను కుంబిడి సింగి పంచాయితి గద్దెరాయి, కుంబిడిసింగి గ్రామాల్లో సిపిఎం ప్రతినిధి బృందం చేపట్టింది. గ్రామాల్లో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మత్యగడ్డ రాళ్ళగడ్డ వాగులను పరిశీలించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి అప్పలనరస మాట్లాడుతూ, రాళ్ళగడ్డ వాగులో ఇప్పటికీ ముగ్గురు మహిళలు గల్లంతు అయ్యారని తెలిపారు. పాలకుల నిర్లక్ష్యానికి ఇంత ఎంత మంది ప్రాణాలు బలి అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 40లక్షలతో బ్రిడ్జి నిర్మాణానికి కేటాయించిన నిధులు కూడా దారీ మళ్ళించడం అన్యాయమన్నారు. అంబులెన్స్ కూడా గ్రామాలకు రావడం లేదన్నారు.బ్రిడ్జి లేక గ్రామాల్లో ఇతర అభివృద్ధి పనులు కూడా ముందుకు సాగలేదన్నారు. గద్దె రాయి గ్రామాల్లో స్థానిక ప్రజలు 1లక్ష రూపాయలు సొంత నగదుతో ఊటగడ్డ నుండి పైపులైన్ ఏర్పాటు చేసుకున్నారన్నారు.వాటర్ మోటార్ మరమ్మతుకు గురై నేటికీ ఆరు నెలలు గడిచినా కనీసం పట్టించుకోలేదన్నారు. కుంబిడిసింగిలో ఊటనీరు ఆధారంగా మారిందని, డ్రైనేజీలు, ఇల్లు మంజూరు చేయలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.మాడుగుల మండల నాయకులు జె.దీనబందు, జిల్లా కమిటీ సభ్యుడు వంతలా దాస్, స్థానిక పీసా కమిటీ ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, బి.వెంకటరామయ్య, పి. మోహన్‌రావు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు మచ్చులు కరుణానిధి, హరిబాబు, చిట్టిబాబు, రామూర్తి వెంకట్ గ్రామస్తులు పాల్గొన్నారు.

పెదబయలు: పీఎం జన్మన్ పథకం కింద గృహాలకు 10 లక్షల రూపాయలు వెంటనే మంజూరు చేయాలని మండల సిపిఎం కార్యదర్శి సన్నిబాబు ప్రభుత్వానికి డిమాండ్ చేసారు. మండలంలోని అడుగులు పుట్టు పంచాయతీ తమర్ధ లక్ష్మీపేట, కోదువలస తదితర గ్రామాలలో సిపిఎం ప్రజా చైతన్య యాత్ర కొనసాగింది.ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సన్ని బాబు మాట్లాడుతూ, ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి ప్రకటించిన రెండు లక్షల 39 వేలు సరిపోవని, పెరుగుతున్న ధరలకనుగుణంగా లబ్దిదారులకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలన్నారు.

దుంబ్రిగుడ:- మొర్రిగుడలో తారు రోడ్డు నిర్మాణం చేయాలని సిపిఎం మండల నాయకులు గసభ మాజీ సర్పంచ్ పి సురేష్ కుమార్, మండల నాయకులు పి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మొర్రిగుడ గ్రామంలో పర్యటించారు. గొందివలస తారు రోడ్డు నుంచి మొర్రిగుడ గ్రామం వరకు గత ప్రభుత్వ హాయంలో ప్యాకేజీ అంచనా విలువ సుమారు రూ 57.8లక్షల రూపాయలు మంజూరైందనీ, కొంత వరకు పనులు కూడా జరిగిందని బిల్లు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారనీ చెప్పారు.పలు మార్లు జిల్లా కలెక్టర్, ఐటిడిఎ ప్రోజెక్టు అధికారికి పిర్యాదు చేసినా రోడ్డు పనులు జరగలేదన్నారు.ఈ కార్యక్రమంలో వార్డుమెంబర్ పాంగి రాజ్ కుమార్, ఫీసా కార్యదర్శి సోమేశ్ కుమార్, సిపిఎం గసభ పంచాయతీ నాయకులు పి రామారావు, సింహద్రి, ధర్మరావు, తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేటలో....

హుకుంపేట: మండలంలోని గన్నేరుపుట్టు పంచాయితీ గవ్వలమామిడి-సంపంగి పుట్టు -పీవీటీజీ గ్రామానికి తారు రోడ్డుకు నిధులు మంజూరు చేయాలనీ హుకుంపేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు డిమాండ్ చేశారు.సీపీఎం ప్రజాచైతన్య యాత్రలో భాగంగా వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు ఆ గ్రామానికి చేరుకొని అక్కడి ప్రజల కష్ట సుఖాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి తారు రోడ్డు, పీవీటీజీ లకు 35 కేజీల బియ్యం, తాగునీటి పైప్ లైన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాయి, రామన్న, రవి, గణేశ్, బాలన్న, కొండమ్మ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మండలంలోని మాడగడ పంచాయతీ పివిటిజి గ్రామలైన జాకరవలస, కుసుమగూడ రోడ్డు సౌకర్యం కల్పించాలని సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు డిమాండ్ చేశారు.మంగళవారం సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గ్రామంలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులతో నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, జాకరవలస (కుసుమగూడ)మెసగూడ గ్రామాలకు రోడ్డు సమస్యతో పాటు వేసవి కాలంలో వస్తుండడంతో మంచినీరు సమస్య నెలకొంటుందన్నారు. గ్రామస్తులు చందాలు ఎత్తుకొని సొంతంగా రోడ్డు మార్గం చేసుకున్న దుస్థితి ఈ గ్రామంలో నెలకొందన్నారు.ఈ కార్యక్రమంలో కిల్లో బంగార్రాజు, కిల్లో సత్యారావు, కిల్లో అనూష, సూరిబాబు, శ్రీను, మర్రి భీమ, వంతల అప్పారావు, కొర్రా సన్యాసిరావు పాల్గొన్నారు.

కూనవరంలో...

జి.మాడుగులలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

అరకులోయ రూరల్: మండలంలో చొంపి గ్రామంలో ఉన్న పెద్ద చెరువుని మరమ్మతులు చేసి పంట పొలాలకు సాగు నీరు అందించాలి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గ్రామంలో ఉన్న రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత కొంతకాలంగా గ్రామంలో సాగునీరు, తాగునీరుకి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.గ్రామంలో ఉన్న పెద్ద చెరువులో పూడికలు తీయించి రక్షణ గోడ నిర్మించి చెరువుని అందుబాటులోకి తీసుకొస్తే సుమారు 400 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ నాయకుడు రెండవ వార్డ్ మెంబర్ బడ్నాయికి కోగేశ్వరరావు, పిసా గ్రామ కమిటీ కార్యదర్శి దశరథ్, ఆనంద్, మాజీ వార్డు సభ్యులు పండు పాల్గొన్నారు.

కూనవరం : మండలంలోని బొజ్జరాయిగూడెంలో మంగళవారం ప్రజా చైతన్య యాత్ర ప్రారంభించారు. ఇక్కడ నుండి గ్రామాల్లో తిరుగుతూ కూటూరు గ్రామానికి చేరుకుంది. సిపిఎం నాయకులు ఆయా గ్రామాల్లో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పొగాకు రైతులతో మాట్లాడారు. పొగాకు గిట్టుబాటు ధర లేదని రైతులు తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య మాట్లాడుతూ జిఓ నెంబర్ 3ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మండలంలోని ప్రయారిటీ గ్రామాలకు తక్షణమే పరిహారం చెల్లించాలని, భీమవరం నుండి బురద గూడెం వరకు ఆర్ అండ్ బీ రోడ్డు మీదుగా కొత్త విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటూరు సర్పంచ్ బొగ్గా వెంకమ్మ, ఎంపీటీసీ జయసుధ, మడెం బాబురావు, లింగపురం సర్పంచ్ శంకర్, తెల్లం తమ్మయ్య, నానుపల్లి వెంకటేశ్వరావు, గుండం బాబురావు, తొండా లక్ష్మణ్, సుమన్ హరీష్ పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీలు, సంఘాలు, సంస్థల నాయకులు

జెండాలను పక్కన పెట్టి..

నిర్వాసితుల అజెండాను ఎత్తుకుందాం

అఖిల పక్షం సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి-విఆర్.పురం

తమ రాజకీయ జెండాలను పక్కనబెట్టి పోలవరం నిర్వాసితుల ఎజెండాను ఎత్తుకొని సమస్యలపై కలసికట్టుగా పోరాడుదామని అఖిలపక్ష సమావేశంలో తీర్మానించారు. మండలంలోని రేఖపల్లి ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో పోలవరం నిర్వాసితుల సమస్యలపై మంగళవారం అఖిల పక్ష సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ మండలంలో పేరుకుపోయిన నిర్వాసిత సమస్యలు ప్రభుత్వం పరిష్కరించే వరకూ, ప్రతి ఒక్క నిర్వాసితునికి న్యాయం జరిగే వరకూ వెనకడుగు వేసేది లేదని స్పష్టం చేశారు. 41.15 కాంటూరు గ్రామాల్లో ఇంకా కొండపోడు భూములకు, జిరాయితీ భూములకు నష్టపరిహారం చెల్లించలేదని, భూమికి భూమి నేటికీ కొంతమందికి చూపించలేదని తెలిపారు. పునరావాస కాలనీల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. పెద్దపెద్ద పొదలతో నిండిపోయి, రోడ్లు లేక మంచినీటి సౌకర్యం లేక అస్తవ్యస్తంగా ఉన్నాయని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు మండలంలోని జీడిగుప్ప, తుమ్మిలేరు, శ్రీరామగిరి పంచాయతీల పరిధిలో దాదాపు 300 మంది వరకు ఉన్నారని, వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ప్రయారిటీ గ్రామాలుగా గుర్తించిన విఆర్.పురం, ధర్మతాళ్ల గూడెం, పత్తిపాక, గుండుగూడెం, రామవరప్పాడు, కన్నాయిగూడెం, సోముల గూడెం, లక్ష్మీనగరం, వెంకన్న గూడెం, రాజుపేట తదితర గ్రామాల పరిస్థితి ఏమిటని వాపోయారు.

సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టిడిపికి చెందిన జెడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, మాజీ జడ్పిటిసి ముత్యాల రామారావు, ఏఎస్‌డిఎస్ సంస్థ అధినేత ఉండవల్లి గాంధీబాబు, పిట్టా రామారావు, సోడే నర్సమ్మ (సర్పంచులు), బీరక సూర్యప్రకాష్‌రావు, బురక సారయ్య (టిడిపి), మాదిరెడ్డి సత్తిబాబు, చిక్కాల బాలకృష్ణ, బొడ్డు సత్యనారాయణ (వైసిపి), అండిమేని లీలాకృష్ణ (కాంగ్రెస్), ముత్యాల రాంబాబు, ఉయిక రత్తయ్య, సన్యాసి మల్లయ్య (బిజెపి), బాగుల అంజన్‌రావు (జనసేన), సున్నం రాజులు, సోయం చినబాబు, పోడియం శ్రీరామ్మూర్తి, పంకు సత్తిబాబు, కమ్మిచిచ్చు సత్యనారాయణ, వడ్లాది రమేష్, పులి బొజ్జి, నాగిరెడ్డి, కొండారెడ్డి, శీరపు తాతబాబు (సిపిఎం), పలు గిరిజన సంఘాల నాయకులు, పీసా కమిటీల అధ్యక్ష కార్యదర్శులు, పాత్రికేయులు, నిర్వాసిత గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

గిరిజన సంక్షేమ సహాయ అధికారిణి జయ నాగలక్ష్మి

ప్రజాశకి-చింతపల్లి : ఈనెల 17వ తేదీ నుంచి జరిగే పదవ తరగతి పరీక్షలలో విద్యార్థిని విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని చింతపల్లి గిరిజన సంక్షేమ సహాయ అధికారిణి జయ నాగలక్ష్మి అన్నారు. చింతపల్లి, జీకే వీధి మండలాలకు చెందిన గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలుర, బాలికల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వసతి గృహాల నిర్వాహకులు, పాఠశాలల ఉపాధ్యాయులతో చింతపల్లి గిరిజన సంక్షేమ సహాయ కార్యాలయంలో సమావేశం నిర్వహించి, పదవ తరగతి పరీక్షలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు పరీక్షల సమయంలో ఇబ్బందులకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షలు రాసే విద్యార్థులకు సమయానికి భోజన సదుపాయం కల్పించాలని, వారిపై ఒత్తిడి చేయరాదని ఆమె సూచనలు చేశారు.

మాట్లాడుతున్న నాగలక్ష్మి

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: జిల్లాలో పిఎంఎవై, పిఎం జన్ మన్ పథకాల కింద చేపట్టిన ఇళ్ళ నిర్మాణాలు వేగవంత అయ్యేలా ఎంపిడిఓలు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలు నుండి వివిధ శాఖల పని తీరు, వారు చేస్తున్న అభివృద్ధి పనులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన కలెక్టర్ మాట్లాడుతూ, సాంకేతిక కారణాలు చూపించి ఆలస్యం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇప్పటికే ప్రగతిలో ఉన్న నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఎన్ఆర్ఇజిఎస్ కింద ఇళ్ళ నిర్మాణానికి కేటాయించిన 90 దినాల పని దినాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. తద్వారా లబ్దిదారునికి రావలసిన లబ్ధిని ఆ మేరకు అందించే విధంగా చూడాలని, ఇళ్ళను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం పిఎంఎవై 2.0 (రెండు పాయింట్ జీరో) సర్వే ను ఈ నెల 20వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పిఎంఎవై, పిఎం జన్ మన్ పథకాల కింద చేపట్టిన ఇళ్ళ నిర్మాణాలకు అయ్యే ఖర్చును పెంపుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తద్వారా ఎస్ సి, బిసి లకు అదనంగా రూ.50 వేలు, ఎస్ టి లకు రూ.75 వేలు, పివిటిజిలకు లక్ష రూపాయలు చొప్పున అదనంగా లబ్ది చేకూరుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పిఎం జన్ మన్ కింద అర్హత కలిగిన 40,506 మంది లబ్దిదారులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.2.39 లక్షలకు అదనంగా మరో లక్ష రూపాయలు చొప్పున అదనంగా లబ్ది చేకూరుతుందన్నారు. పిఎంఎవై కింద 13,689 మంది ఎస్టీ లబ్దిదారులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.1.80 లక్షలకు అదనంగా రూ. 75 వేలు చొప్పున రూ.102.67 కోట్లు, 3,422 మంది పివిటిజి లబ్దిదారులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.1.80 లక్షలకు అదనంగా లక్ష రూపాయలు చొప్పున రూ.34.22 కోట్లు అదనపు లబ్ది చేకూరుతుందని కలెక్టర్ వివరించారు. జిల్లాలో 57,617 మంది లబ్దిదారులకు సుమారు రూ,541.95 కోట్లు లబ్ది చేకూరుతుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో హౌసింగ్ పిడి బి.బాబు, డి ఎం హెచ్ ఓ డాక్టర్ జమాల్ బాషా, ఐసిడిఎస్ పిడి ఎన్ సూర్యలక్ష్మి, గ్రామ సచివాలయాల నోడల్ అధికారి పీఎస్ కుమార్, కార్మిక శాఖ అధికారి సుజాత పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న కలెక్టర్

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి -పాడేరు : పిడుగుపడి మృతి చెందిన కిల్లో నరసింగ రావు(18) కుటుంబానికి జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆర్థిక సహాయాన్ని అందజేసారు. పెదబయలు మండలం జామిగుడ పంచాయతీ జడిగూడ గ్రామానికి చెందిన కిల్లో నరసింగరావు గత ఆగస్టు 18న పొలంలో పనులు చేస్తుండగా పిడుగు పడి మృతి చెందాడు. మృతిని తలిదండ్రులు కిల్లో లివ్వు , తల్లి ఆల్మే మంగళవారం జిల్లా కలెక్టరును కలిసి జరిగిన సంఘటనను వివరించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సానూకూలంగా స్పందించి వారికి ధైర్యం చెప్పారు. కుటుంబానికి రూ. 10 వేలు ఆర్థిక సహాయ అందజేసారు. ఈ కార్యక్రమంలో 'జామిగుడ సర్పంచ్ కిరనాడ వెంకట రావు పాల్గొన్నారు.

బాలునికి వైద్యం అందించడంలో డాక్టర్ల నిర్లక్ష్యం

- సుమారు రెండున్నర గంటల పాటు నిరీక్షణ
- చేసేది లేక భద్రాచలం ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లిన వైనం

ప్రజాశక్తి-కూనవరం

జ్వరంతో బాధపడుతున్న ఏడాది వయసు బాలుడిని మండలంలోని కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తీసుకొస్తే డాక్టర్లు వైద్యం అందించకుండా నిర్లక్ష్యం చేసిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. చేసేది లేక బాధిత తల్లిదండ్రులు బాలుడిని భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

బాధిత బంధువులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు ప్రకారం... కూనవరం మండలం గొమ్ము అయ్యవారిగూడెం గ్రామానికి చెందిన కర్నాటి సందీప్ కుమారుడు చైతన్య (ఏడాది వయస్సు)కు తీవ్రమైన జ్వరం రావడంతో సోమవారం రాత్రి 7 గంటల సమయంలో కోతులగుట్ట సిహెచ్‌సికి తీసుకొచ్చారు. అక్కడున్న వైద్య సిబ్బంది డాక్టర్లు లేరని, వేచి ఉండాలని సూచించారు. గంట సమయం గడిచినా బాలుడికి ఎటువంటి వైద్య సేవలు అందించలేదు. వైద్యులు కూడా రాలేదు. దీంతో బాధితుని బంధువులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో రాత్రి 8 గంటల సమయంలో వచ్చిన డాక్టర్ బాలుడికి ఒక ఇంజక్షన్ ఇచ్చి ఊరుకున్నారు. అత్యవసర పరిస్థితిలో ఉన్న బాలునికి వైద్య పరీక్షలు, వైద్య సేవలు అందించకుండా కాలయాపన చేశారు. దీంతో బాధితులు తమ కుమారుడిని వేరే ఆసుపత్రికి తీసుకెళ్లిపోతామని చెప్పి వెళ్లిపోతూ ఉండగా, ఆసుపత్రి సూపరింటెండెంట్ వచ్చి వైద్యం చేస్తామని చెప్పి మళ్లీ లోపలకు తీసుకెళ్లారు. కాని బాలుడికి వైద్యం అందించకుండా బాధిత తల్లిదండ్రులతో మాట్లాడుతూ వారి నుండి తమకు కావాల్సిన సమాచారం రాబట్టుకుంటూ వీడియో రికార్డింగ్ చేశారు. అనంతరం రాత్రి 9.30 గంటల తరువాత తమ ఆసుపత్రిలో చిన్నపిల్లల వైద్య నిపుణులు లేరని వేరే ఆసుపత్రికి తీసుకెళ్లాలని చావుకబురు చల్లగా చెప్పారు. కనీసం సంబంధిత వైద్య సేవలు ఉన్న ఆసుపత్రికి రిఫర్ చేయడం గాని, అంబులెన్స్ సౌకర్యం కల్పించడంగాని చేయలేదు. దీంతో చేసేది లేక ప్రైవేటు వాహనంలో భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి బంధువులు బాలుడిని తీసుకెళ్లి వైద్యం అందించారు. ఏజెన్సీ ప్రాంతంలో పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మారిందని, ఉన్న వైద్యులు గిరిజనులకు సక్రమంగా వైద్య సేవలు అందించడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. సంబంధిత జిల్లా అధికారులు స్పందించి ఈ సంఘటనపై విచారణ చేసి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా, అందరికీ అందుబాటులో వైద్య సేవలు అందించే విధంగా చర్యలు చేపట్టాలని ఏజెన్సీ వాసులు కోరుతున్నారు.

తీవ్ర జర్వంతో బాధపతున్న బాలుడిని ఆసుపత్రిలో ఎత్తుకున్న తండ్రి

గిరిజన రైతుల్లో సాంకేతిక దృక్పథం పెంపొందించాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

గిరిజన రైతుల్లో శాస్త్రీయ అవగాహన, సాంకేతిక దృక్పథం పెంపొందించాలని జెడ్డంగి పంచాయితీ రైతులకు సిటిఆర్ఐ (నిర్కా - జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధనా సంస్థ) డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషు మాధవ్ అన్నారు. గిరిజన ఉప ప్రణాళిక 2024-25లో భాగంగా గిరిజన రైతులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ మిరప, పసుపు, అశ్వగంథ, ఆముదం వంటి పంటలను, పొగాకు పంటతో బాటు పరిశోధనలు మొదలుపెట్టిందని తెలిపారు. భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసిఏఆర్) వారు ఇటీవలే ఈ సంస్థను జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధనా సంస్థగా రూపాంతరం చేశారని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతాలలో జీడిమామిడి పంట అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారని, ఈ పంటకు ఎరువులు తగిసంతగా అందించలేక పోతున్నారని, అందువల్ల దిగుబడులు గణనీయంగా తగ్గిపోతున్నాయని చెప్పారు. రైతులు జీడిమామిడి పంటకు ఎండుకొమ్మలను కత్తిరించుకొని, కనీసం రెండుసార్లు గ్రే ఇమిడాక్లోప్రిడ్ వంటి పురుగుమందును స్ప్రే చెయ్యటం వలన టీ దోమను, కాండము తొలుచు పురుగులను అరికట్టవచ్చని తెలిపారు. శిక్షణా కార్యక్రమం అనంతరం యూరియా ఎమ్‌పి మ్యూరేట్ ఆఫ్ పొటాష్ బస్తాలను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉప ప్రణాళిక చైర్మన్ డాక్టర్ కె కుమారి కళ్యాణి, జెడ్పిటిసి వడుగుల జ్యోతి, గ్రామ సర్పంచ్ కొంగర మురళీకృష్ణ. మాజీ సొసైటీ అధ్యక్షులు గణజాల తాతారావ్, పెద్ద సంఖ్యలో గిరిజన రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఎరువుల బస్తాలు అందిస్తున్న దృశ్యం

గిరిజనేతరులకు పక్కా గృహాలు మంజూరు చేయండి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజాశక్తి-రంపచోడవరం

గిరిజన చట్టాలకు విఘాతం కలగకుండా గిరిజనేతరులకు పక్కా గృహాలు మంజూరు చేయాలని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అసెంబ్లీలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం ఆమె మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో దాదాపు 40 శాతం మంది గిరిజనేతరులు ఉన్నారని తెలిపారు. 1952 నాటికి పూర్వం నియోజకవర్గాలు ఏర్పాటు చేసే సమయానికే గిరిజనేతరులు తమ నియోజకవర్గంలో ఉన్నందున వారికి కూడా పక్క నివాస గృహాలు ఏర్పాటుకు వెసులుబాటును కల్పించాలని కోరారు. కొన్ని వందల ఏళ్లుగా గిరిజనులు, గిరిజనేతరులు అన్నదమ్ముల వలే కలిసి ఉన్నామని, కనుక గిరిజనేతరులకు కూడా న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఒకే కాన్పులో మూడు దూడల జననం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని లోతట్టు గ్రామమైన ఓగిపాలెం గ్రామంలో మంగళవారం గిరిజన రైతు పొలంపాక వద్ద ఒక ఆవు ఒకే కాన్పులో మూడు దూడలకు జన్మనిచ్చింది. సాధారణంగా ఒక కాన్పుకు ఒకటి దూడ పుడుతుంది. కొన్ని సందర్భాల్లో రెండు దూడలు కూడా పుడతాయి. కాని భీమిరెడ్డి నాగేశ్వరరావు పెంచుతున్న ఆవు ఏకంగా మూడు దూడలకు జన్మనిచ్చింది. అందులో ఒక దూడ మరణించగా మిగతా రెండు దూడలు, ఆవు ఆరోగ్యంగా ఉన్నాయని యజమాని నాగేశ్వరరావు తెలిపారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి-సీలేరు : గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా జీకే వీధి మండలం సీలేరులో ట్రైనీ ఎస్సైలు రెడ్డి వంశీకృష్ణ, పి శివ మంగళవారం సాయంత్రం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల నుంచి వచ్చే పోయే వాహనాలను ఏపీ జెన్కో చెక్ పోస్ట్ వద్ద నిలిపివేసి క్షుణ్ణంగా తనిఖీ చేసి విడిచిపెట్టారు. ఏఓబి సరిహద్దు నుంచి గంజాయిని మైదాన ప్రాంతానికి అక్రమంగా రవాణా జరుగుతున్నట్లు ఇంటెలిజెన్సీ వర్గాలు పదేపదే హెచ్చరికలు జారీ చేస్తున్న నేపథ్యంలో సిఆర్పిఎఫ్ పోలీసు బలగాలను మోహరించి ఈ తనిఖీలు చేపట్టారు. ఐటిఐ జంక్షన్ దగ్గర తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల నుంచి వచ్చి పోయే వాహనాలను తనిఖీ చేసి వ్యక్తులు వివరాలు సేకరించి విడిచిపెట్టారు. మావోయిస్టు కదిలికలపైనా ప్రత్యేక దృష్టి సారించారు.

ఏపీ జెన్కో చెక్ పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

డోలీ మోతల నివారణకు చర్యలు

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్
-7 అంబులెన్సులు ప్రారంభం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: జిల్లాలో డోలీ మోతలు నివారణకు తగిన చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా కొవ్వాడ న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ రూ.1 కోటి వ్యయంతో వితరణ చేసిన 7 అంబులెన్సులను ఐటిడిఎ కార్యాలయం వద్ద మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతగా వితరణగా ఇచ్చిన అంబులెన్సులను వైద్య సేవలకు వినియోగిస్తు న్నామన్నారు. మాతా శిశు మరణాలు నివారణకు తగిన వైద్య సేవలు అందించాలని సూచించారు. 370 గ్రామాలకు కనీస రహదారులు లేవని రానున్న రెండు మూడు సంవత్సరాలలో వీటి నిర్మాణానికి చర్యలు చేపట్టామని చెప్పారు. పిహెచ్ సిలకు అంబులెన్సులు సమకూర్చి 15 సంవత్సరాలు పూర్తవడంతో మరమ్మతులకు గురవుతున్నాయన్నారు. ఐటిడిఎ నుండి అంబులెన్సులకు చమురు సరఫరా చేస్తున్నామన్నారు. ప్రముఖ సినీ నటుడు సోనూ సూద్ రెండు అంబులెన్సులను వితరణ చేసారని తెలిపారు. జిల్లాకు 1650 మొబైల్ టవర్లు మంజూరు చేయగా 1000 టవర్లను పూర్తి చేసి కమ్యూనికేషన్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెప్పారు.

అరకు ఎమ్మెల్యే రేగం మత్యలింగం మాట్లాడుతూ ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, గోమంగి, రూడకోట, గన్నెల, ఉప్ప తదితర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అంబులెన్సులు మంజూరు చేయాలని కోరారు. ఐటిడిఎ ఇన్చార్జి పిఒ, జెసి ఎంజె అభిషేక్ గౌడ మాట్లాడుతూ, కొవ్వాడ ఎన్ పిసిఐఎల్ సామాజిక బాధ్యతగా గిరిజన ప్రాంతానికి గొప్ప సహకారం అందించిందన్నారు. ఎన్ పిసిఐఎల్ మంజూరు చేసిన 7 అంబులెన్సులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కేటాయిస్తున్నామన్నారు. కోరుకొండ, ఈదులపాలెం, జి.మాడుగుల, జికె.వీధి, ఉప్ప, ఆర్వి నగర్, రాజేంద్రపాలెం పిహెచ్ సిలకు కేటాయించామన్నారు. పాడేరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏజెన్సీలో పెద్ద ఎత్తన రహదారులు మంజూరు చేసి నిర్మాణాలు చేపడుతోందని తెలిపారు. ఎన్ పిసిఐఎల్ అసోసియేట్ డైరెక్టర్ కెవిఎస్ బివి ప్రసాద్ మాట్లాడుతూ గత ఏడాది ఐటిడిఎ పిఒ అభిషేక్ ను కలిసి గిరిజన ప్రాంతం అభివృద్ధికి సిఎస్ఆర్ కింద సహకారం అందిస్తామని కోరగా అంబులెన్సులు మంజూరు చేయాలని సూచించారని చెప్పారు. జిల్లా అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ .జమాల్ భాషా, డిఐఒ .సాధన, ఐటిడిఎ పరిపాలనాధికారి ఎం.హేమలత, ఎన్ పిసిఐఎల్ అడిషనల్ చీఫ్ ఇంజనీర్ బి.రవికుమార్, హెచ్ఆర్ మేనేజర్ ప్రదీప్ కుమార్, రవితేజ, చిన్ని, బొర్రా విజయరాణి, లగిశ పల్లి సర్పంచ్ పార్వతమ్మ, పలువురు వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

'యువత పోరు'ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- దుంబ్రిగుడ: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 12న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే యువత పోరు కార్యక్రమంలో అధిక శాతం మంది నిరుద్యోగ యువత పాల్గొని విజయవంతం చేయాలని వైసిపి పార్టీ మండల అధ్యక్షుడు పి.పరశురాం పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే మత్యలింగం ఆదేశాల మేరకు అరకు సంత బయలు గ్రామంలో యువత పోరుకు సిద్ధం కావాలని పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విస్మరించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సింహాచలం, కృష్ణారావు, అశోక్,నాగేశ్వరరావు ,నర్సింగ్, గురు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఈనెల 12న పర్యటిస్తున్నట్లు స్థానిక ఎంపీడీవో ఏవివి .కుమార్ ప్రకటనలో తెలిపారు. మండలంలో నెలకొన్న పలు సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష

ప్రజాశక్తి-సీతమ్మధార : జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అధ్యక్షతన డిఎం అండ్ హెచ్ఒ కార్యాలయంలో ఆరోగ్య కార్యక్రమాలపై ఢిల్లీ పిఆర్‌సి (పాపులేషన్ రీసెర్చ్ సెంటర్) నుండి వచ్చిన కేంద్ర బృందం సమీక్ష నిర్వహించింది. కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ రమణ, డాక్టర్ పాదాలు పని తీరుపై సమీక్షించారు.

తరచుగా.. సిగ్నల్‌కు అంతరాయం


సెల్ టవర్

ప్రజాశక్తి-దుంబ్రిగుడ
మండలంలో గత వారం రోజుల నుంచి బిఎస్ఎన్ఎల్ సిగ్నల్‌కు తరచుగా అంతరాయం ఏర్పడుతుండడంతో వినియోగదారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎప్పుడు లేని విధంగా ప్రస్తుతం గత కొద్ది రోజుల నుంచి నిమిషం సిగ్నల్ ఉంటే మరో నిమిషం సిగ్నల్ కట్ అవుతుంది. ఫోన్లో మాట్లాడే సమయంలో మధ్యలో అంతరాయం ఏర్పడడంతో పాటు సిగ్నల్ సక్రమంగా లేక పోవడంతో అవతల పక్క నుంచి మాట్లాడే వాయిస్ కూడా సరిగా వినిపించకపోవడంతో వినియోగదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. బిఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ నెట్ సౌకర్యం ద్వారా నెట్ కేంద్రాలు వినియోగిస్తున్న వినియోగదారులు సక్రమంగా నెట్ సౌకర్యం లేక పోవడంతో నిర్వాహకులకు వ్యాపారాలు జరగక ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏజెన్సీ ప్రాంతంలో బిఎస్ఎన్ఎల్ ,జియో, ఎయిర్టెల్ సౌకర్యాలు ఉన్నప్పటికీ మొదటి నుంచి అధిక శాతం మంది బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఉన్నారు. జియో రీఛార్జ్ ధరలను కూడా అధికంగా ఉండటంతో ఎక్కువ శాతం మంది బిఎస్ఎన్ఎల్ ఉపయోగించుకుంటున్నారు. ప్రస్తుతం గత వారం రోజుల నుంచి తరచుగా కొద్ది నిమిషాల పాటు సిగ్నల్ ఉంటూ మధ్యలో అంతరాయం పడుతుంది. గతంలో ఒకటి రెండు రోజులు పూర్తిగా అంతరాయం ఏర్పడిన తర్వాత మరమ్మత్తు చేస్తే ఇబ్బందులు ఉండేవి కావు. గత కొద్ది రోజులుగా సిగ్నల్ కట్ అవుతుండడంతో ఇబ్బందులు పడుతున్నామని వినియోగదారులు అంటున్నారు. సంబంధిత బిఎస్ఎన్ఎల్ అధికారులకు ఫిర్యాదు చేసినా వెంటనే మరమ్మతు చేసి సిగ్నల్ పునరుద్ధరించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని పలువురు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి బిఎస్ఎన్ఎల్ సిగ్నల్స్‌లకు అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

1/70 చట్టానికి తూట్లు పొడిస్తే సహించం

ఆదివాసీ గిరిజన సంఘం హెచ్చరిక

ప్రజాశక్తి-పాడేరు :- రాష్ట్ర శాసనసభలో రంపచోడవరం ఎమెల్యే మిరియాల శిరీషాదేవి గిరిజనేతరులకు పక్కా గృహాలు మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేయాలని చట్టసభలో మాట్లాడడం ఆదివాసీల మనుగడకు ఆదివాసీ హక్కులు, చట్టాలకు ద్రోహం చేయడమేనని ఆదివాసీ గిరిజన సంఘం. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్ ధర్మన్నపడాల్ పొద్దు బాలదేవ్ ఉద్ఘాటించారు ఈ విషయంపై మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ 1952 ముందునుండి రంప చోడవరం ఏజెన్సీలో నివసిస్తున్న 40 శాతం గిరిజనేతరులకు పక్కా గృహాలు నిర్మించుకోవడం కోసం ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని రంపచోడవరం ఎమెల్యే అడగడం 1/70 చట్టం ఉల్లంఘించడమే అవుతుందన్నారు. 1/70 చట్టంపై ఇటీవల శాసనసభ స్పీకర్ ప్రకటనకు వ్యతిరేకంగా ఆదివాసులు తిరగబడ్డారని దిగివచ్చిన ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి 1/70 చట్టం రక్షణకై కట్టుబడి ఉన్నామని ప్రకటించడం నిజమేనా లేక ఆదివాసులకు నమ్మించి మోసం చేయడమా అని ప్రశ్నించారు.ఎమెల్యే శిరీషాదేవి మాటలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.జీఓ నెంబర్-3 చట్టబద్ధత కల్పించాలని, ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిపికేషన్ విడుదల చేయాలని, ఆదివాసీ గ్రామాల్లో రోడ్లు, వంతెనలు నిర్మించాలన్నారు. అనంతగిరి మండలంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలన్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -గోపాలపట్నం : యువతి తన ప్రేమను అంగీకరించలేదని మనస్తాపంతో యువకుడు మంగళవారం ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధి కొత్తపాలెం ఆదర్శనగర్‌లో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి గోపాలపట్నం పోలీసుల కథనం ప్రకారం... ఆదర్శనగర్‌లో కొట్యాడ శ్రీనివాసరావు కుటుంబం నివసిస్తోంది. శ్రీనివాసరావు కార్పెంటర్ పనిచేస్తు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శ్రీనివాసరావు కుమారుడు కొట్యాడ లోకేష్ (19) ఐటిఐ పూర్తి చేసి ఏసీ మెకానిక్ వద్ద పనిచేస్తున్నాడు. రెండు రోజులుగా పనికి వెళ్లకుండా ఇంట్లోనే మౌనంగా బాధపడుతూ ఉంటున్నాడు. గత కొన్నేళ్లుగా లోకేష్ ఒక యువతిని ప్రేమిస్తున్నాడు. ఇటీవల ఆ అమ్మాయి తన ప్రేమను అంగీకరించలేదని మనస్థాపానికి గురయ్యాడు. సోమవారం రాత్రి యథావిధిగా భోజనం చేసి ఇంటిపై అంతస్తులో పడుకునేందుకు వెళ్లాడు. మంగళవారం ఉదయం ఎంతకీ బయటకు రాకపోవడంతో 11 గంటల సమయంలో తల్లి రామలక్ష్మి పైకి వెళ్లి చూసింది. తలుపులు మూసి ఉండడంతో గదికి మరోవైపున ఉన్న కిటికి తలుపులు తెరిచి చూసింది. గదిలో ఫ్యాను హుక్కుకు చీరతో ఉరి వేసుకుని కనిపించాడు. కుమారుడ్ని ఆ స్థితిలో చూసి బోరున విలపిస్తూ కేకలు వేసింది. చుట్టు పక్కల వారి సహాయంతో తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లారు. అప్పటికే మృతి చెందడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చిన వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐ గొలగాని అప్పారావు నేతృత్వంలో ఎస్ఐ రామారావు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.

పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి -గాజువాక : స్థానిక న్యూ పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా పిడిఎస్ బియ్యాన్ని రవాణా చేస్తున్న ముగ్గురిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు హార్బర్ ఎసిపి కాళిదాసు తెలిపారు. న్యూపోర్టు పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పాత అయ్యన్నపాలేనికి చెందిన జి.ప్రసాద్ నుంచి గత నెల 14వ తేదీన 161 కేజీల బియ్యాన్ని, అదే రోజు కోరాడ గ్రామానికి చెందిన పిఇ.కొండలరావు నుంచి 263 కేజీల బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. గొడ్డువానిపాలేనికి చెందిన అంకాల నారాయణరావు దగ్గర ఫిబ్రవరి 17వ తేదీన 1600 కేజీల బియ్యం, ఈనెల 10వ తేదీన 3500 కేజీల బియ్యం పట్టుకున్నట్లు తెలిపారు. మొత్తం 5,524 కేజీల బియ్యం పట్టుకున్నట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సిఐ కామేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు అనంతపద్మనాభ స్వామి తెప్పోత్సవం

ప్రజాశక్తి -పద్మనాభం : మండల కేంద్రమైన పద్మనాభంలో అనంతపద్మనాభ స్వామి తెప్పోత్సవాన్ని బుధవారం నిర్వహిస్తున్నారు. తెప్పోత్సవ కార్యక్రమాలకు ఆలయ ఇఒ నానాజీబాబు, ఎంపిపి రాంబాబు ఏర్పాట్లు చేస్తున్నారు. తెప్పోత్సవం నిర్వహించే కన్నయ్య కోనేరులో చుక్క నీరు లేకపోవడంతో వారం రోజులుగా నీటిని నింపుతున్నారు. కోనేటినిండా నీటిని నింపడం పెద్ద జల యజ్ఞమే అవుతుంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇఒ, ఎంపిపి కోరారు.

ఆల్ ఇన్ వన్ గైడ్‌లను అందిస్తున్న రాజులు, తదితరులు

విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ గైడ్స్ పంపిణీ

ప్రజాశక్తి-ఎటపాక : ఎటపాక మండలం గౌరిదేవిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అరోరా స్కూల్ ఆఫ్ నర్సింగ్ చైర్మన్ తాళ్లూరి హరిబాబు సహాయంతో ఆల్ ఇన్ వన్ గైడ్‌లను ప్రధానోపాధ్యాయుడు శ్రీశైలం ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఇఒ సరియం రాజులు మాట్లాడుతూ పరీక్షల వేళ విద్యార్థులు భయాందోళన వీడాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒత్తిడిని అధిగమిస్తూ ఎటువంటి ఇబ్బందీ లేకుండా అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయాలన్నారు. పరీక్ష హాలులో ఏదైనా ఇబ్బంది ఉంటే వెంటనే ఇన్విజిలేటర్‌కు తెలియజేయాలని సూచించారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలన్నారు. హరిబాబు అందిస్తున్న సేవలు కొనియాడారు. అనంతరం విద్యార్థులకు ఆల్ ఇన్ వన్‌లు అందజేశారు. కార్యక్రమంలో గౌరిదేవిపేట ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్ పవన్ కుమార్, హెూలీ స్పిరిట్ కార్యదర్శి దారా రవి, కార్యవర్గ సభ్యుడు ములకలపల్లి రమేష్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎపిఒ రెడ్డి బాబు

ఉపాధి కూలీలు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : వేసవి నేపథ్యంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా ఉపాధి హామీ కూలీలు పని ప్రదేశంలో జాగ్రత్తలు పాటించాలని స్థానిక ఉపాధి హామీ ఏపీవో రెడ్డి బాబు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఎపిఓ పర్యవేక్షించారు. ఉపాధి మేట్లకు, ఉపాధి సిబ్బందికి, కూలీలకు పలు సూచనలు చేశారు. ఉదయం 5.30 నుంచి 11 గంటల వరకే పనులు చేయాలని, తమ వెంట రెండు లీటర్లకు తగ్గకుండా మంచినీరు ఇంటి వద్ద నుండి పని ప్రదేశానికి తీసుకువెళ్లాలని, ఏమైనా అలసట ఉంటే తమకు ఏర్పాటు చేసిన టెంట్ నీడలోకి వెళ్లాలని, పని ప్రదేశంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనపు సాయం

ప్రజాశక్తి-రంపచోడవరం : ఇళ్లుకట్టుకునే ఎస్‌సి, ఎస్‌టి, బిసి గృహ లబ్ధిదారులకు అదనపు సాయం చేసేందుకు ప్రభుత్వం జీవో జారీ చేసిందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌టిలకు రూ.75వేలు, పివిటిజిలకు లక్ష రూపాయలు అదనపు సాయం అందనుందని చెప్పారు. పిఎంఎవై (అర్బన్, గ్రామీణ్) బీఎల్సీ-1.0 కింద ఇప్పటికే మంజూరైన ఇళ్లకు ఈ సాయం లభించనుందని తెలిపారు. అదనపు సాయం అందించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి, హౌసింగ్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అజయ్ జైన్‌కు, మేనేజింగ్ డైరెక్టర్ రాజాబాబుకు ఎమ్మెల్యే శిరీష కృతజ్ఞతలు తెలిపారు.

న్యాయం జరిగే వరకూ పోరాటం

విసిఐసి నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కల్పించకుండా పనులా ?
సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
బాధిత గ్రామాల్లో జోరుగా ప్రజా చైతన్య యాత్ర

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, నక్కపల్లి విలేకరి
విశాఖ - చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితుల భూములకు పూర్తి పరిహారం, పునరావాసం కల్పించకుండా పనులెలా చేపడతారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. పిడిఎఫ్ గ్రామాల్లో ఇళ్లు, భూములు, చెట్లకు పూర్తి పరిహారం, మేజర్లకు ప్యాకేజీ చెల్లించకుండా చేపడుతున్న పనులను అడ్డుకోవాలన్నారు. న్యాయమైన పరిహారం కోసం నిర్వాసితులు చేసే పోరాటానికి సిపిఎం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. మంగళవారం నక్కపల్లి మండలం కాగిత, పాటిమీద, మూలపర్రు, తమ్మయ్యపేట, రాజయ్యపేట, బుచ్చిరాజుపేటల్లో జరిగిన ప్రజా చైతన్య యాత్రలో ఆయన పాల్గొన్నారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం డి పట్టా భూములకు జిరాయితీ భూముల వలే పరిహారం చెల్లించాలన్నారు. పూర్తి పరిహారం చెల్లించకుండా భూములు అప్పగించబోమని చెప్పాలన్నారు. న్యాయమైన పరిహారం, పునరావాసం, ప్యాకేజీ దక్కే వరకూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. పరిహారం చెల్లింపులో చట్టాన్ని ఉల్లంఘించిన అధికారులను జైల్లో పెట్టాలన్నారు. నిర్వాసితులను బెదిరించి భూములు, ఇళ్లు స్వాధీనం చేసుకునే అధికారులకు కలెక్టర్ నోటీసులు జారీజేయాలన్నారు. మిట్టల్ వంటి పెట్టుబడిదారులకు అమ్ముడుపోయి ప్రజలపై జులుం ప్రదర్శిస్తే ఐక్య పోరాటాలతో తిప్పికొడతామన్నారు. దౌర్జన్యంగా భూమి, ఇళ్లు ఖాళీ చేయించే అధికారం ప్రభుత్వానికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. రైతుల భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని అన్నారు. భూములిచ్చిన స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. డి పట్టా, సాగు భూముల్లోని చెట్లకు పరిహారం చెల్లించకుండా నిరంకుశంగా ప్రజలపట్ల వ్యవహరించడం సరికాదన్నారు. తీర ప్రాంతంలో బల్క్ డ్రగ్ పార్క్ మరణ శాసనంలా తయారైందని తెలిపారు. గ్రామసభ, ప్రజల ఆమోదం లేకుండా పార్కు పెట్టకూడదన్నారు. గ్రామాలకు తాగునీరు ఇవ్వలేనివారు, ప్రజలను అభివృద్ధి చేస్తామనడం మోసగించడమేనని అన్నారు. కాలుష్య బాధిత రాజయ్యపేట గ్రామ కుటుంబాలకు ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. న్యాయమైన హక్కులు, పర్యావరణ పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ రాజయ్యపేటలో సాగులోవున్న మత్స్యకారులు, పేదలకు పట్టాలివ్వాలన్నారు .వేట నిషేధ కాల పరిహారం రూ.20 వేలను మత్స్యకారులకు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ, ఎం.రాజేష్, డిడి.వరలక్ష్మి, నక్కపల్లి మండల నాయకులు మహేష్, యాదగిరి, బత్తిన నాగేశ్వరరావు, ప్రసాద్, రాము, రాజయ్యపేట సభలో జెడ్‌పిటిసి కాసులమ్మ, జనసేన నాయకులు పిక్కి స్వామి తదితరులు పాల్గొన్నారు.

పాటిమీద ప్రాంతంలో వృద్ధురాలి సమస్యలను తెలుసుకుంటున్న వి.శ్రీనివాసరావు

విశాఖ - పాట్నా మధ్య హోలీ ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల రద్దీని నియంత్రించే క్రమంలో విశాఖపట్నం - పాట్నా మధ్య మూడు ట్రిప్పుల ప్రత్యేక రైళ్లు నడపాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో 08537 విశాఖపట్నం - పాట్నా హోలీ ప్రత్యేక రైలు మార్చి 16, 23, 30 తేదీలలో ప్రతి ఆదివారం రాత్రి 19:30 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి మరుసటి రోజు రాత్రి 21:00 గంటలకు పాట్నా చేరుకుంటుంది. అదేవిధంగా 08538 పాట్నా - విశాఖపట్నం హోలీ ప్రత్యేక రైలు మార్చి 17, 24, 31 తేదీలలో ప్రతి సోమవారం రాత్రి 22:30 గంటలకు పాట్నాలో బయలుదేరి బుధవారం తెల్లవారుజామున 3:50 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ప్రయాణికులు ఈ ప్రత్యేక రైళ్ల సేవలను వినియోగించుకోవాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు

'పని చేయని ఉద్యోగులు అవసరం లేదు'

ప్రజాశక్తి-కొయ్యూరు : గిరిజనులకు సేవలందించని ఉద్యోగులు అవసరం లేదని ఎంపీపీ బడుగు రమేష్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మంగళవారం ఎంపిపి రమేష్ అధ్యక్షులు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం జరిగింది. సర్వసభ్య సమావేశానికి రాని వైద్యాధికారులు, ఫారెస్ట్ అధికారులపై ఆయన మండిపడ్డారు. మధ్యాహ్నం 12 గంటలకు మొదలుపెట్టిన సమావేశంలో ముందుగా ఐసిడిఎస్, ఉపాధి హామీ, విద్య, అగ్రికల్చర్, పశు వైద్య శాఖ అధికారులు తమ పరిధిలో సమస్యలను తెలియజేశారు. సమావేశానికి డుమ్మా కొట్టిన ఫారెస్ట్ అధికారులు, వైద్యాధికారులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాయాలని ఎంపీడీవోకు ఎంపీపీ సూచించారు. ఎన్ఆర్జీఎస్ ఏపీవో విధులకు రాకపోవడంపై మండిపడ్డారు. అటవీ ప్రాంతంలో యుజెడ్.పాలెం పరిధిలో ఉన్న 12 కిలోమీటర్ల రోడ్డు నిర్మించగా మధ్యలో కల్వర్టుకు ఫారెస్ట్ అధికారులు ఎందుకు ఇబ్బంది పెడుతున్నారని ప్రశ్నించారు. కొంతసేపు వాడివేడిగా జరిగిన సర్వసభ్య సమావేశంలో పూర్తిస్థాయిలో అధికారులు సర్పంచులు నాయకులు లేకపోవడంతో మధ్యాహ్నం రెండు గంటలకే ముగిసింది.

మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాస విశ్వనాధ్

టెన్త్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మండలంలో పదవ తరగతి పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేశామని, పరీక్షా రాసే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వసతి ఏర్పాట్లు చేశామని ఎంపిడిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పరీక్షా నిర్వహణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 17 నుండి ఏప్రిల్ 1 తేదీ వరకు జరుగు పరీక్షల కోసం మారేడుమిల్లి ఎపి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, బోదులూరు ఆశ్రమం బాలికల ఉన్నత పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేసినట్లు చెప్పారు రెండు కేంద్రాలలో 11 ఉన్నత పాఠశాలలకు చెందిన 383 విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు, పరీక్షా నిర్వహణ సిబ్బందికి ఇబ్బంది లేకుండా పరీక్షా కేంద్రాలలో తాగునీరు, మినీ వైద్య శిబిరాలు, ఫ్యాన్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోనులు తీసుకురాకూడదన్నారు. పరీక్షా కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్ నియాకంతో పరీక్షా నిర్వహణ పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిఎస్ కుమార్, బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సత్యవేణి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు ఫర్నీచర్ రాక

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలలకు సుమారు రూ.16లక్షల విలువచేసే ఫర్నిచర్ వచ్చినట్లు స్థానిక ఎంఈఓ కెవివి సత్యనారాయణదొర మంగళవారం విలేకరులకు తెలిపారు. మండలంలోని మారుమూల గ్రామాల్లో ఉన్న 17 పాఠశాలలకు డ్యూయల్ డెస్కులు, టేబుల్స్, చైర్లు, బ్లాక్ బోర్డులు, హబ్ కో ద్వారా సరఫరా చేయడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 సూరారెడ్డి, సీఆర్పీలు శ్రీను, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-సీలేరు : సీలేరు కాంప్లెక్స్ పరిధి మోతుగూడెంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన తెలుగు నాడు కార్మిక సంఘం నాయకులు మంగళవారం ఎపి జెన్కో ఎస్ఇ సివిల్స్ చంద్రశేఖర్ రెడ్డిని కలిసి పలు సమస్యలపై విన్నవించారు. స్థానికంగా నెలకొన్న పారిశుధ్యం మెరుగుపర్చాలని, కోతుల వలన స్థానికులకు ఇబ్బంది ఏర్పడుతుందని చెప్పారు. ఈ సమస్యల పరిష్కారానికి ఎస్ఇ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆర్ అప్పారావు వి.కృష్ణ ఎన్.వరప్రసాద్, వి త్రినాధరావు, జయ రత్నం, ఎస్ భాస్కరరావు, కిరణ్, వరహాలు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని ఆశ్రమ, గురుకుల పాఠశాలలలో పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు రంపచోడవరం ఎంపీపీ బందం శ్రీదేవి తన సొంత నిధులతో పరీక్షా సామగ్రి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుండం శ్రీనివాసు దొర మాట్లాడుతూ 500 పైబడి మార్కులు తెచ్చుకునే ప్రతి ఒక్కరికీ రూ.1116 పారితోషికంగా అందజేయడం జరుగుతుందని చెప్పారు. ఎంఇఒ రామకృష్ణ మాట్లాడుతూ ఎంపీపీ చేతుల మీదుగా విద్యార్థులకు హాల్ టికెట్స్ అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమములో సీడీపీఓ సంధ్యారాణి, ఎంపీటీసీ వంశీ కుంజం, బొబ్బా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.